దండాలండి,

మీవంటి పెద్దల తోడుపాటుతో, శ్రీలంక అహికుంటక వారికి, తెలుగును నేర్పించే పనిని తనివిగా ముగించ గలిగినాము. ఈ పని మలేసియా దేశంలో జరిగిందని మీకు తెలిసినదే. మే నెల 11వ తేదీ పొద్దున శ్రీలంక నుండి 8మంది తెలుగు పిల్లలు మలేసియాకు చేరుకొన్నారు. అంతకు వారం ముందే తెలుగు నెరవు జట్టు మలేసియాకు చేరుకొనింది. శ్రీలంక వారికి మలేసియా వీసా దొరకడం చాలా ఇక్కట్టు అయ్యింది. మలేసియాలోని సత్య సుధాకర్ గారు, వీరలక్ష్మి గారు ఈ పనిని తలకు ఎత్తుకొని ఎంతో పాటుపడి వారికి వీసాను రప్పించగలిగినారు. శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయంలో ఉద్యోగిగా ఉన్న బ్రహ్మంగారి తోడుపాటు మరువలేనిది. 11, 12 తేదీలలో అహికుంటక వారికి, మలేసియాలోని కొన్ని చూడవలసిన చోటులను చూపించినాము. ఈ పనిని మలేసియా తెలుగు సంఘం వారు చేసినారు. సంఘం అధ్యక్షులైన డా. వెంకట ప్రతాప్ గారు 11వ తేదీ రేయి అందరికీ విందును ఏర్పాటు చేసినారు. 13వ తేదీ నుండి, బాగన్ డతో దగ్గరలోని సుంగై సుమూన్ అనే పల్లెలో తెలుగు తరగతులు మొదలు అయినాయి. ఆ ఊరివారైన వెలగ అప్పలనాయుడు గారు వసతి, తిండి, వైద్యం వంటి అన్ని అక్కరలను దగ్గరుండి చూసుకొన్నారు. వారి ఇంటిలోనే తెలుగు నెరవు జట్టుకు చెందిన స.వెం.రమేశ్, స.విజయ్, కె.మునిరాజు గార్లకు వసతిని ఇచ్చినారు. మలేసియా తెలుగు సంఘానికి చెందిన బాగన్ డతో శాఖ వారు చదువరులకు వసతిని ఏర్పాటు చేసినారు. అక్కడి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గుడిలో ఉన్న గ్రంథాలయపు గదిలో తరగతులు నడచినాయి. ఆ గుడి సంఘానికి అధ్యక్షులు అయిన గొర్లి ఆనందరావు గారు తోడుపడినారు. ఒకనాటికి ఏడు గంటల చొప్పన 15నాళ్ల పాటు తరగతులు జరిగినాయి. పిల్లలంతా చాలా అక్కరతో తెలుగును నేర్చుకొన్నారు. బాగన్ డతోలో ఉంటున్న గురువుగారైన గొర్లి ప్రకాశ్, ఉదయ భాను దంపతులు మాపటి పూట శ్రీలంక పిల్లలకు చిరతలు(కోలాటం), దాటు భజన, గొబ్బిళ్లు వంటి కళలను ఆడడం నేర్పించినారు. వారి అమ్మాయి గొర్లి నిషిత తోడుపాటు మరువలేనిది. మే 28న ఆ పిల్లలకు చిన్న రాత పరీక్షను పెట్టి, ఆపొద్దే మలేసియా తెలుగు సంఘం పెద్దలచే వారికి ఒరపు రేకు(Certificate)ను అందజేసినాము. మే 29న సుంగై సుమూన్ నుండి బయలుదేరి, రవాంగ్ లోని తెలుగు విద్యాలయం దగ్గరకు చేరుకొన్నాం. అక్కడ మలేసియా తెలుగు సంఘపు ఇదివరకటి అధ్యక్షులు అయిన డతో డా. అచ్చయ్య కుమార్ రావు గారు పిల్లలను కలసి మెచ్చుకొని, కొన్ని కానుకలను అందించినారు. ఆపొద్దు నడిరేయిలో శ్రీలంకవారు వారి దేశానికి పయనమై పోయినారు. మే 30 పొద్దున తెలుగు నెరవు జట్టు తిరిగి భారత దేశానికి చేరుకొనింది. 15నాళ్లలోనే శ్రీలంక పిల్లలు చిన్న చిన్న కతలను చదువగలిగినారు. మీ అందరి మంచి తలపులతో ఇది జరిగింది. ఇది చిన్న కదలిక మట్టుకే. ఇంకా కొనసాగవలసినది ఎంతో ఉంది. జూలై నెల నుండి, శ్రీలంకలోని ఐదు పల్లెలలో వారం చివరి తెలుగు తరగతులు మొదలు కాబోతున్నాయి. మనదగ్గర తెలుగును నేర్చుకొన్న పిల్లలే ఆ తరగతులను నడుపబోతున్నారు. శ్రీలంకలో మరింత మంది తెలుగువారు తమ అమ్మనుడికి చేరువ కాబోతున్నారు. ఈ పనిని మనం అందరం కలసి చేసినాము. మరొకసారి మీకు నిండు గుండెలతో మప్పిదాలను తెలియచేసుకొంటున్నాము.

తెలుగును నేర్చుకొన్నవారి పేర్లు:

1. దుగిడి ఉదయంగని దీపికా కుమారి
2. దుగిడి వసుధ ససాంతి జయమీణి
3. దుగిడి సుమాషా దులాంజలి
4. తేబల దిల్రోమని
5. తేబల ఇషుమి దీక్షికా ప్రమోది
6. తేబల సందుని ఉపేషికా స్వర్ణమాలి
7. తేబల రొషానీ సెవ్వంది పెరెరా
8. తేబల వసంత